# ముఖచిత్రం

నిన్న రాత్రి కలమాత్రం వచ్చింది: నీవు రాలేదుగదే జవరాలా!--

ఝాము ప్రొద్దుపోయింది; మా యిల్లు మాటుమణిగింది:

తాతగారు, మందువా దగ్గిరగా, పట్టెమంచంమీద, తలక్రింద చేయి గుమ్మలించుకుని, పడుకున్నారు; అమ్మమ్మ, ఆ సరసనే మర్యాదా అంతా ఎడంగా, చాప పరుచుకుని, బొంతమీద బొంత తీర్చి దిద్దుకుని, తల క్రింద తాళం చెవులు, తలాగడ దిక్కున మర చెంబూ పెట్టి, నడుం నొప్పిగా రంగణ్ణి స్మరించే - ఆవలించి, అమ్మయ్య-గా ఒరిగి ఒత్తిగిలింది.

తాతగారు, పనస చదివినట్లు పై వాక్యం అనగానే, అమ్మమ్మ ఆపసోపాలు మానేసి తనలో తాను నవ్వుకోవడం ప్రారంభించింది: నవ్వు ఆపుకోలేకుండానే -

"ఎందుకండీ, తీరిపడుకుని అలా కలవరిస్తారు?" - అంటూ లేచికూర్చునేందుకు ప్రయత్నిస్తూనే ఉంది, తాతగారు, చక్కిలిగిలి అయినంత గందరగోళంగా లేచి కూర్చున్నారు.

పక్కగదిలోనే నేను పడుకున్నాను. ఏదో పుస్తకం నామీద పడుకుంది; నా అంతట నాకు ఎప్పుడూ రాత్రి నిద్రరాదు. దీపం తగ్గించే దీవెన పుట్టింటికి వెళ్ళింది -?

పెళ్ళాం అనేది అయోనిజ అయితే, ప్రతి మగరాయడూ బ్రతికిపోతాడు కద! పుట్టిల్లంటూ ఉండగానే - చీటికి మాటికి ఆ యింటివారు రమ్మనడం - ఆ గాలిసోకగానే యీ పిల్ల - తల్లి, అమాంతం ముద్దులకూతురై అమ్మ చెంగు పట్టుకు వదలకుండా, కట్టుకున్న వాడిపోరు, కన్నవాడి పోరూ చెవిని పట్టకపోవడం - ఏతావతా అందరూ కట్ట కట్టుకుపోవడం - ఆరగా ఆరగా ఆ ఆటలేకితనం పోయి, మళ్ళీ యిటు మళ్ళేలోగా - ఇక్కడ యీ నాధుడనేవాడు, ఒంటిపోచ జంధ్యమల్లే అఘోరించుతుండడం - ఇదంతా పుట్టిల్లంటూ ఒకటి ఉండటం మూలాన వచ్చిన అనర్థమేకదా!

పోనీ, నీ మనసులో మమకారం కొద్దీ - పంపనంటావనుకో - అందరూ కలిసి యిల్లు తీసి పందిరి వెయ్యరూ? ధారాపాతంగా కలకంఠి కన్నీరు నీ ఆవరణ యావత్తూ ఒలకదూ?

అప్పుడు నీవు చేయని తప్పుకు ఎలాగూ చెంపలు వేసుకోవడం తప్పదు.

తాతగారు ఎంత అదృష్టవంతుడు! ఆయన భార్య - అనగా అమ్మమ్మ - కాపురానికి వచ్చిన వెనువెంటనే, వాళ్ళ పుట్టిల్లు ఉన్న ఊరుకు ఉప్పెనవచ్చి, ఒక్క ఆ పుట్టిల్లంటూనే కాకుండా, దానికి ఏ మాత్రమైనా సంబంధం అంటూ ఉన్న యిళ్ళు యావత్తూకూడా - అజాపజా లేకుండా గుటక వేసుకుపోవడంతో -

తాతగారికి, అటువైపు బాధ ఉత్తరత్రా లేకుండా పోయింది; అది అలాఅయిపోయింది కదా అని ఎన్నడన్నా తలుచుకు గునిసేందుకున్నా తీరికి లేకుండా – తాతగారు సంసార పక్షంగా చక్కదిద్దుకుంటూ వచ్చారు – ఆయన అదృష్టం ఆయనిది: – నేను అసూయపడితేమాత్రం, ఇలా తప్ప మరోవిధంగా – తెల్లవారుతుందా?

తాతగారన్నది విన్నాను: అమ్మమ్మ నవ్వగానే మన కెందుకు పోనిద్దూ – తప్పు: చూడకూడదు – అనుకుంటూనే దొంగచూపు చూశాను – ఇద్దరూ ఎక్కడున్న చోటే ఉన్నారు – తాతగారి గడ్డం రేకలుమాత్రం, గాలి లేకపోయినా చూచాయగా రేగుతూన్నట్టు అనిపించింది:

"ఏమండీ – మంచినీళ్ళు కావాలా?"

"ఆఁ? ఏమిటీ చోద్యం!–" తాతగారు మునుపటి ఘన సత్తువగా అడిగారు: లేచి నిలుచుని, పరకాయిస్తూ –

"ఏమే వయ్యారీ – ఇరవై యేళ్ళ ఈ నడుమ ఏ రాత్రి అయినా నాకు దాహం వేసినట్టు దాఖలా ఉందా? ఉన్నట్టుండి – ఈ ఏదీ కానివేళ – ఇలా కోరకబోయినావేం?"

తాతగారు, బహు వడుపుగా – త్రిభంగిగా – అమ్మమ్మ చెక్కిలిమీద కొనగోరుతో – అలా అన్నాడు: ఆవిడ ఝుళుక్కున కులికి ఎన్నో మెలికలుగా నవ్వుకుంటూంది:

నాకు కోపం, నవ్వూ విసుగూ వేసుకు వచ్చింది: వీళ్ళు ఈ వేళప్పుడు ఇలా శివాలాడటం మొదలుపెట్టారేం, కృష్ణా రామా అంటూ, ఏ నడుం నొప్పితోనో పడుకోక – మూలుగుతూ!

అమ్మమ్మ గొంతు మళ్ళీ రవంత సడీ – చప్పుడూగా కిచకిచలాడుతూంది.

"అబ్బ! ఇష్ –' ఊరుకోండి – ఇద్దెక్కడ అప్రదిష్టమ్మా! ఏమిటీ చేష్టలు? – పిల్లవాడు చూచిపోయేను."

తాతగారు తెగించి నవ్వుతున్నాడు – తిట్టినట్టు అంటున్నాడు – "చూస్తే – బాగుపడిపోయేను!"

"అమ్మీ! – ఆ వెన్నెల చూడు – ఆ నక్షత్రాలు చూడు! – ఎక్కడో మలయపర్వతాన్నుంచి అనేక వ్యయ ప్రయాసలకు ఓడ్చి, మనల నందరిని ఉద్ధరించాలని ముంచెత్తడానికి వచ్చిన చల్లగాలిని చూడు ––

ఈ వేళప్పుడు – మునుపు మనం ఇలాగే వున్నామా? – నీవు మీ పుట్టింట వుంటే – నేను వుసూరుమంటూ, రొమ్ముమీద ఏ పుస్తకమో కప్పుకుని ఆపసోపాలు పడుతూ, గోడమీది బల్లుల సరసాలు చూసి వులికిపడుతూ వుండేవాడినా? ఒక్కరోజైనా బీరుపోనిచ్చావా? ఎంత నిశి – రాత్రి అయినా, రెక్కలు కట్టుకు వాలేవాడిని కాదూ!"

ఇంతసేపటికి అర్థం అయింది నాకు తాతగారి ధోరణి – పండబారిన ఆ రతీమన్మధులు – వాళ్ళ మనసు నా మీద పదును పెడుతున్నారు.

కసి తీర్చుకుంటున్నట్టు – తాతగారు ఉపదేశించినట్టే చేశాను: నేను మెసులుతూన్న అలికిడి, వాళ్ళకు సోకనీకుండా – బట్టలు వేసుకుని వీధి తలుపు దగ్గిరగా పెట్టి హుటాహుటీ బయలుదేరాను.

ప్రొద్దుపోయినమాట నిజమే – కాని మా బావమరిదికి పరీక్షలాయెను: వాడింకా కంట్లో వత్తులు వేసుకుని చదువుతూనే వుంటాడు – బుద్ధి తెలిసినవాడు గనుక – నన్ను – నా రాకా చూసి మనసులో నవ్వుకున్నా, మామగారల్లే పట్టుకుని అనేది మొగాన అనేసి; నాపని ఎందునా గాకుండా చెయ్యడు: వాడినే బ్రతిమాలుకుంటే – మా పెళ్ళికూతుర్ని నిద్రలేపుతాడు – ఇహ ఆ తరువాత – "సర్వమున్ అతని దివ్యకళామయము–"

కాని, ఇంత సంబరంపడుతూ వెళ్ళిం తరువాత, వెళ్ళిన బులలాటం గుమ్మంలోనే బొప్పికట్టింది. అంత ప్రొద్దుపోయినా వాడు అరుగుమీద రేవిణీవేసి చదువుకుంటున్నాడు – వాళ్ళ అక్కయ్య మేలుకునే కూర్చుంది.

నిజంగా, ఇలవేలుపులందరూ ఈ పాలిట వున్నారని, ఉవ్వెత్తున గంతేశాను: గుమ్మంలోకి అడుగు వేశాను –

వాడు – తల ఎత్తి చూసి – ఏం బావా – ఎక్కడనుంచి! – అని చదువుకునే వాక్యంలో కలిపి ఉచ్చరించాడు: వాళ్ళ అక్కయ్య నేను మడి అనుకున్నట్లు ఎగిరి దూరంగా గంతేసింది:

తెల్లపోయి – గుండె గతుక్కుమని ఆ వంక చూశాను: ఎంతో జాలిగా – పదవి కదలించింది.

అంతే! తిరిగి ఎలా ఇల్లు చేరుకున్నానో – నాకే తెలియదు – కాని, తలవంచుకుని, ఇంట్లోకి పోయేందుకన్నా వీలులేకుండా – తాతగారు, అరుగుమీద చుట్ట కాల్చుకుంటూ, నా కోసం ఎదురుచూస్తున్నట్టు కూచున్నారు:

అడుగు అక్కడే ఆగిపోయింది;

తాతగారు, అతి సజావుగా –

"ఏం రా నాయనా! వచ్చావూ!" అన్నారు. రాక పోయినా బాగుండేది: తెల్లవార్లూ – ఊరంతా బలాదూరు తిరిగినా బాగుండేది; ఓ చాప ఇవతల వేయించుకుని నేనూ, ఆ అరుగుమీదే మనికితే బాగుండేది కాని –

తాతగారు – నన్ను పొదివిపట్టుకుని సరసను కూర్చోబెట్టుకున్నారు:

"నన్ను అడిగితే – నేను చెప్పకపోదునా? ఈ కాలం వాళ్ళకు సరిగా కూడికలూ, తీసివేతలూ అయినా రావాయె. ఏ నెల కానెల యావజ్జీవమూ ముప్పైరోజుల్లో మూడు ప్రొద్దులు అలా వుంచాల్సిందే:–"

నవ్వేందుకు నాకు ధైర్యం చాలలేదు – ఇంతలో అమ్మమ్మ గుమ్మంలోకి వచ్చింది – మా సరసం చూసింది.

"పోనిద్దురూ! వాడినేం వేధిస్తారండీ! – వడసారం పసివాడు" అంటూ సర్దిచెప్పబోయింది – తాతగారు, నమక పారాయణ చేస్తున్నట్టు.

"పసితనాన వంటపట్టకపోతే – మనసు బోసిపోదుటే అమ్మీ:– ఔనుగాని, ఇది తాతామనుమల వరుస! – నీవు నిష్క్రమించు–" అంటూండగానే ఆవిడ ఇంకా ఏం సరసం రువ్వుతాడో అని లోపలికి దూసుకున్నది – మిగతా పారాయణ నా పాలబడ్డది.

"కంటికి కన్ను అంటిపెట్టుకుని ఎన్నియుగాలైనా గడపవచ్చునే - ఎందుకు వచ్చేశావోయ్ వచ్చి ఇక్కడ దేవర బావుకునే దేమిటోయ్ -

నా మనుమరాలిని కళ్ళు వార్మీకి వర్ణించాడురా, నాన్నా? నా తపస్సు ధారపోశాను: నీకు దక్కించాను కాని - మడిగట్టుకున్నావ్! - బ్రాహ్మడివి!"

తాతయ్య రాసిక్యం - నే నెప్పుడూ కళ్ళకు అద్దుకునేదే! ఆయనలా చీల్చి చెండాడుతున్నా నన్ను ఎంతో ఆప్యాయంగా వెన్ను నిమురుతున్నట్టు వుంది: ఇవ్వాళ తప్పు చేస్తేనేమో నావంటి అజ్ఞానులు రేపు తరించేది అనిపించింది.

"ఊc! ఇక పోయి పడుకో, అహితాగ్నీ! నీతో కూచుంటే, వెన్నెల వెలా తెలాపోతుంది - మా కన్నెకుమారి - కన్నులపండువు చేయాలి!" అని తాతగారు - గదమాయింపుగా లేచారు - నేను చెర వదిలించుకున్నట్టు లోపలికి దూకపోయినాను. ఆయన నవ్వుతూ చెయ్యి వడిసి పట్టుకుని -

"రేపూ ఇంతే అనుకునేవ్! తెల్లవారిన తరువాత - పిల్లది, తల ఇక్కడే అరబెట్టుకుంటుందిలే?" అని జాజిపొద కదిలినట్టు నవ్వాడు - నన్ను వదిలేశాడు.

★ ★ ★